REGD. NO. A 40 — విడి ప్రతి 0-20 న. పై — శుక్రవారం 17-6-60

# జమీన్ రైతు

సంస్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు

సంపుటి 32 * సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి * సంచిక 25

## విద్యామంత్రి విందు చేయలేదట

3-6-60 'జమీన్ రైతు'లో ''శ్రీ సుబ్బారెడ్డిగారి నిష్క్రమణ ఆనంద చిహ్నంగా విందులా?'' అను శీర్షిక క్రింద, 2 తేది 'ఆంధ్రపత్రిక'లో ప్రకటింపబడిన ఒక వార్తను పునర్ముద్రిస్తూ, సుబ్బారెడ్డిగారి రాజీనామా ఆమోదానికి విటికి సంబంధమేమైనా వుందాఅని రాజకీయ పరిశీలకులు సందేహిస్తున్నారని, సుబ్బారెడ్డిగారి రాజీనామా అములుకు వచ్చిననాటి సాయంకాలం శ్రీ సుబ్బారెడ్డికి బద్ధవిరోధి అనుకునే శ్రీ పట్టాభిరామారావు విందు చేయడం, తర్వాత రోజు సచివాలయంలో జరగడం యీ అనుమానానికి ఆస్కారం కల్గిస్తున్నదని వెలిబుచ్చాము. కాని తాను ఆనాటి (31 తేది) రాత్రిగాని, గత ఐదుమాసాలలోగాని తన యింటిలో విందులు, వినోదాలు ఏమీ జరిపింది లేదని శ్రీ పట్టాభిరామారావుగారు తెలియజేస్తున్నారు. పొరపాటుకు చింతిస్తూ, యీసవరణను పాఠకులు గమనించవలసిందిగా కోరుతున్నాము. విద్యామంత్రిగారి వివరణ దురభిప్రాయాలకు ఆస్కారంలేకుండా చేస్తున్నది.

### హైదరాబాదు లేఖ

# రాష్ట్రకాంగ్రెస్ అధ్యక్షుడుగా శ్రీ నరోత్తమరెడ్డి

నూకల నరోత్తమరెడ్డి గారు చాలా మంచి వారుఅని హైదరాబాదు లోకోక్తి. దీన్ని పురస్కరించుకునే నీలం సంజీవరెడ్డిగారు ఈయనను దగ్గరకుతీసి ఆరుమాసాలమాత్రమే బ్రతికిన తెలంగాణా కాంగ్రెసుసంఘానికి జె. వి. నర్సింగరావుస్థానంలో (1957-58లో) అధ్యక్షుడుగా ఎన్నికయేట్టు ప్రయత్నించి కృతకృత్యులైనారు. దానితో రాష్ట్రమంత్రి వర్గంలో ఈయనకు, లేక ఈయనభార్యకు స్థానం తప్పదనేమాట ప్రచారంలోకివచ్చింది. వీరికివలెనే ఇతర చాలామందికికూడా సంజీవ రెడ్డిగారు ముఖ్యమంత్రిగా వున్నంతకాలం మంత్రులమవుతామనే ఆశవుండేది.

జె. వి. నర్సింగరావు గారివలెనే నరోత్తమ రెడ్డిగారుకూడా డాక్టర్ చెన్నారెడ్డి నాయకత్వంక్రింద పెరిగినమనిషి. ఇద్దరూ దాదాపు ఒకేసమయంలో చెన్నారెడ్డిగారి పెత్తనానికి అతీకీలకమైన అవస్థలో తిలోద కాలిచ్చి సంజీవరెడ్డి పంచచేరారు. ఫలితం: ఒకరికి మంత్రిపదవి, మరొకరికి ముందు మంత్రిపదవి లేదా రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షత ఆశతో అప్పుడు ప్రాంతీయ కాంగ్రెసు సంఘానికి అధ్యక్షత లభ్యమయాయి. అయితే ఈపదవులు తమ విద్రోహాప్రవర్తనకు ''ఇనామ్''గా వీరు స్వీకరించడానికి వీరిద్దరికీ మూడేళ్ళుపట్టింది. మంత్రిపదవిలభించని నరోత్తమరెడ్డి గారు, సంజీవరెడ్డి గారు రాష్ట్ర నాయ-

## ఏ.సి. వ్యవహారంలో-హైదరాబాద్ ఎన్నికల్లో వీరి పాత్ర

కత్వంనుంచి తప్పుకుంటున్నారని ధృవపడిన మరుక్షణంనుంచే తమ భక్తి విశ్వాసాలను మార్చుకుని తమ సోదరసమేతంగాను, మిత్రబృందంతోను అల్లూరికంచకు చేరారు. ఫలితం: రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షత తనకు; అన్నకు మంత్రిపదవి. జె. వి. గారిలో ఈమార్పురావడంలో కొంత ఆలస్యమైంది. వచ్చింది కనుక మళ్ళీ మంత్రిపదవి కాకపోయినా ప్రదేశ ఎన్నికల సంఘంలో సభ్యత్వం లభించింది. నిజానికి ఏ. సి. సుబ్బారెడ్డిగారి స్థానంలో మళ్ళీ 14 వ మంత్రిగా జె. వి. గారే అవుతారని ఆయన సన్నిహితులు చెబుతున్నారుకూడా!

రాజారామేశ్వరరావు (వనపర్తి) ఎం. పి. గారి పెట్టుబడితో నడుస్తున్న గోల్కొండ పత్రిక కంపెనీలో నరోత్తమరెడ్డిగారు భాగస్వాములు. ఆ పత్రికకు సంపాదకుడు. ఈయన సంపాదకీయాలు ఆపత్రికలో వ్రాయడం మానేసి ఇప్పటికి అయిదారు సంవత్సరాలవుతున్నది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఎకాడమీ కార్యదర్శి శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు ఈ అయిదారు సంవత్సరాల నుంచి దానికి సంపాదకీయ వ్యాసాలను, జీవచ్ఛవంలా వున్న ఆంధ్ర సారస్వత పరిషత్తు కార్యాలయంలో కూర్చొని వ్రాసి పంపుతూవుంటారు. ఈ రామానుజరావు గారిని శాసనసభ స్థానంనుంచి శాసన మండలికి సభ్యుడుగా కాంగ్రెసు కష్టాన గెలిపించి, ఆంధ్రపితామహ మాడపాటి హనుమంతరావు పంతులుగారి స్థానంలో ఆ సభాధ్యక్షుడుగా ఎన్నిక చేయించాలనే తలంపు నరోత్తమరెడ్డి గారికి కలిగింది. ఉపముఖ్యమంత్రి కొండా వెంకట రంగారెడ్డి గారు, కాంగ్రెసు అధ్యక్షునితోను, కేంద్ర దేశీయ వ్యవహారాలమంత్రితోను కల పలుకుబడిని వినియోగించి ఈ ప్రతిపాదనను ఎదిరించి వుండకపోయినట్లయితే ఈపాటికి నరోత్తమరెడ్డిగారి సంకల్పం నెరవేరివుండేది.

హనుమంతరావు పంతులుగారు వృద్ధులు, సమర్థులు. అయినా ఈ వయసులో ఆయన్ను పదవీ బాధ్యతతో బాధించడం వాంఛనీయం కాదు. ఆయన బదులుగా మరొకరికి ఆపదవి వహించడానికి అవకాశం యిచ్చివుంటే చాలామంది సంతోషించేవారు. కాని పార్లమెంటరీ అనుభవం ఏమాత్రంలేని రామానుజరావుగారికి ఈ పదవి నిర్వహించే అవకాశం యివ్వడం వాంఛనీయమని ఒక్క నరోత్తమరెడ్డిగారే భావించగలరని తోస్తున్నది. మొత్తంమీద తన తలంపులో నెగ్గలేని నరోత్తమరెడ్డిగారు తన రాజీనామా కారణంగా ఖాళీపడిన రాజ్యసభ స్థానాన్నే రామానుజరావుకిచ్చి తన మిత్రప్రేమను చాటారు.

నాలుగేళ్ళుగా నరోత్తమరెడ్డిగారు రాజ్యసభలో సభ్యులుగా వున్నారు. ప్రతిరోజూ తప్పకుండా పత్రికలు చదవేవారెవరికీ ఈయన



ఒక్క ప్రసంగమైనా, ఏ సమస్యపైన అయినా, చేసినట్టు జ్ఞాపకంలేదు. సమర్థులైన పార్లమెంటేరియనులు ఆంధ్రప్రతినిధులుగా లేనందుకు అఖిలభారత రాజకీయ దృశ్యంలో ఆంధ్రులు అదృశ్యులుగా వుంటున్నారు అని అందరూ గమనించిన సత్యమే అయినా అర్థస్థులను ఎన్నుకోవలసినప్పుడు ఎప్పటి కప్పుడు అభ్యర్థుల సామర్థ్యంకన్న, నాయకులకు వారుచేసేసేవ, వారికున్న మైత్రి మొదలైన అనవసర అర్హతలనే పరిగణించడం జరుగుతున్నది.

స్వయం వ్యక్తిత్వం లేనివారు బాధ్యతగల స్థానాలలోకి వచ్చినప్పుడు ఆ స్థానాలకు, పదవులకు, సంస్థలకు విలువలేకుండాపోతుంది. నరోత్తమరెడ్డిగారు దాదాపు ఆరుమాసాల నుంచి ప్రదేశ కాంగ్రెసు సంఘాధ్యక్ష పదవిలో వున్నారు. ఈ కాలంలో, ముఖ్యంగా ఏ. సి. వ్యవహారంలో వీరు నిర్వహించిన పాత్రచూస్తే, రాష్ట్రంలో అసలు ప్రదేశ కాంగ్రెసుఅంటూ ఒకటివుందా అనిపించేట్టు

—కొరవ 12 వ పేజీలో

### మంతెనవారి - హెచ్చరికలు ఆరోపణలు

ఆంధ్ర రాజకీయాలలో శిఖండివంటి వాడైన, రాష్ట్రకాంగ్రెస్ కార్యదర్శి శ్రీ మంతెన వెంకటరాజు ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్యకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ సాగుతున్నట్లు, అది ఫలించదని ఒక హెచ్చరికచేస్తూ, క్రొత్తవిషయం వెల్లడించారు.

సహకారమంత్రి శ్రీ చంద్రమౌళి గుంటూరుజిల్లా సహకారసంస్థలపట్ల వ్యక్తిగత కక్షలతో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, వారిచర్యలను నిరసిస్తూ జిల్లా రాజకీయ మహాసభచేత ఒక తీర్మానంగూడా చేయించారు.

ఆంధ్ర కాంగ్రెస్ రాజకీయాలు క్రమంగా రసపట్టులో పడుతున్నవి. సకాలంలో వీటిని అదుపులో పెట్టకుంటే 1962లో సంస్థకు పుట్టగతులుండవు.


## ::: నిర్మల :::


| | | |
|---|---|---|
| స్పెషల్ కాఫీపొడి | పౌను 1-కి | రూ. 3-50 |
| ప్లాంటేషన్ కాఫీపొడి | .. | రూ. 3-25 |
| హోటల్ బ్లెండెడ్ | .. | రూ. 3-25 |
| స్పెషల్ వక్కపొడి | 1 వీశ | రూ. 13-00 |

వేయించిన కాఫీగింజలు - పచ్చి కాఫీగింజలు - అన్నిరకముల ఫ్యాన్సీ సామానులు - సరసమైన ధరలకు దొరకును.

* వ్యాపారస్తులకు మంచి కమిషను ఇవ్వబడును *

నిర్మల కాఫీ వర్క్సు

ట్రంకురోడ్డు — టెలిఫోన్ :: 280 — నెల్లూరు




- సూళ్లూరుపేట మంచినీటి సౌకర్యం: హైదరాబాదునుండి వచ్చిన ఇంజనీర్ల పరిశీలన
- వెంకటగిరి పంచాయతీకి మరలా ఎన్నికలా?
- నాయుడుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వివాదం

## సూళ్లూరుపేట వార్తలు

మంచినీటికొరత తీర్చుటకు పంచాయతీ బోర్డువారు 15 సంవత్సరాలనుండి ప్రయత్నిస్తున్నారేగాని, యిప్పటికి నీటికొరత తీర్చిందిలేదు. మూడుసంవత్సరాల క్రితం యింజనీరింగుశాఖవారువచ్చి మంచినీరు ఎచ్చటలభించేది పరిశీలించిపోయారు. కాలంగిలో బోరింగులుకూడా వేసిచూచారు. అంతటితో ఆప్రసక్తిపోయింది. ప్రజలుకూడా ఎంతో నిరుత్సాహులైనారు.

కానీ శ్రీఎల్లసిరి రామకృష్ణారెడ్డిగారు ప్లాను ప్రతినిధిగాజిల్లాపరిషత్తుకుఎన్నుకోబడినపిమ్మట వారు హైదరాబాదుపోయి, అడుగునపడివుండిన ఈ కాగితాలను పైకితెచ్చి, మంత్రి శ్రీ ఏ. సి. సుబ్బారెడ్డిగారిచేత ఉత్తర్వులు చేయించినఫలితంగా, ఈ నెల 4 తేది హైదరాబాదునుండి సూపరింటెండింగు ఇంజనీరు వగైరాలువచ్చి, లోగడ చెల్లెమ్మగుంటవద్ద వేసివుండిన బోరింగుప్రదేశాన్ని పరిశీలించారు. ప్రజలు మంచినీటికై పడుతున్న బాధలనుగూర్చి పంచాయతీఅధ్యక్షుడు,ప్రజలు ఇంజనీర్లకు వివరించారు. నీటికుళాయిలపని త్వరలో ప్రారంభించుటకు ఉత్తర్వులు పంపగలమని వారు చెప్పారు.

* * *

వస్తార్ సాహెబుగారి వెంకటేశ్వర మహాల్ ప్రారంభోత్సవం 6 తేది, పార్లమెంటు సభ్యులు శ్రీ ఆర్. గోవిందరాజుల నాయుడు గారిచే జరుపబడింది. శ్రీ అరవభూమి రామచంద్రారెడ్డి, తనమాల రమణారెడ్డిగారలతోవచ్చిన గోవిందరాజుల నాయుడు గారిని హాలుప్రొప్రయిటరు వస్తారుసాహెబు పూలమాలలతో స్వాగతమిచ్చిరి. మాయాబజార్, కాళిదాసు చిత్రాలు కొంతసేపు ప్రదర్శింపబడినవి.

* * *

తడ — చేనిగుంటమధ్య ట్రంకు రోడ్డులో శెవల్లో 3 వ తేది రాత్రి ఒకలారీ బ్రిడ్జికి తగిలి ప్రమాదానికి గురియైంది. ఎవ్వరికీ ప్రాణాపాయమైన గాయాలులేవు. పోలీస్ అధికార్లు వచ్చిచూచిపోయారు. నిత్యం అధికమౌతున్న యీలారీబస్ ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవడం అవసరం.

—యాగంటి రామలింగం.

## వెంకటగిరి పంచాయతీకి మరలా ఎన్నికలా?

పంచాయతీ ఎన్నికలు జరిగి, క్రొత్తబోర్డు వచ్చి సంవత్సరం దాటినా, ఒక్క అభివృద్ధి కార్యం జరుగకపోగా, వివాదాలతో తగాదాలతో కాలం వృధాయగాగా నిశ్చయమైన తీర్మానాలుగా వ్యవహారాలుకూడా స్తంభించిపోయినవంటే అతిశయోక్తి కాదు. పంచాయతీలోని లోపయులు, తదితర కారణాలవల్ల పంచాయతీ రద్దయి మరలా ఎన్నికలు జరుగవచ్చునని; అట్లాగాకుండ పంచాయతీ మునిసిపాలిటీగా మార్చబడి ఎన్నికలు జరుగుతవని ఏమేమో వదంతులు వ్యాపించి వున్నవి. వీటి కెంతవరకు ఆధారమున్నదో చెప్పలేము. జిల్లా పంచాయతీ అధికారి విచారణ కార్యవసానం ఏమౌతుందో చూడవలసి వున్నది.

• • •

రంగు చేసిన కందిపప్పు వుంచుకున్నందుకు రాచపూటి సుబ్బన్నశెట్టికి; కల్తీ నువ్వుల నూనె వుంచుకున్నందుకు కామిశెట్టి ముపెయ్యశెట్టికి చెరి 40 రూపాయలు జరిమానావడ్డిస్తూ, గూడూరు మునసబు మేజస్ట్రేటు శ్రీ రామచంద్ర నాయుడు గారు తీర్పుచెప్పారు.

—పి. రామకృష్ణయ్య.




ముందుగా రిక్షాబాడుగ మాట్లాడుకొనని ఫలితం

## నాయుడుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

నాయుడుపేట సమితికి తలనొప్పి కల్గిస్తున్న సమస్య—యీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం.

సమితి సభ్యులలో అధిక సంఖ్యాకులు దొరవారిసత్రాన్ని అభిమానిస్తారు. అందువల్లనే దొరవారిసత్రంలోనే నెలకొల్పవలసిందిగా సమితి రెండుసార్లు తీర్మానించింది.

శాసనసభ్యులు, జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షుడు, ముఖ్యాధికార్లు మల్లాంపక్షం వహిస్తున్నారు.

బలమైన యీ రెండు పక్షాలమధ్యపడి ఎటూతేల్చలేక ప్రభుత్వం కిట కటాయిస్తున్నట్లున్నది.

36 గ్రామాలు, 11 వేల జనసంఖ్య, మంచినీటి వసతి, భవన నిర్మాణానికి విశాలమైన ప్రదేశం, అన్ని గ్రామాలవారు వచ్చుటకు రోడ్డుసౌకర్యం, వెనుకబడిన ప్రాంతం. దొరవారి సత్రంలో నెలకొల్పమనే వారి వాదం యిది.

సముద్రతీర ప్రాంతం, మలేరియాప్రదేశం,

—కొంవ 11 వ పేజీలో

## స్వతంత్రపార్టీ ఎందుకు?

—0—

### ఉదయగిరితాలూకా సమావేశంలో పార్టీ జిల్లానాయకుల వివరణలు, వుపన్యాసాలు

ఉదయగిరితాలూకా స్వతంత్రపార్టీ కార్యకర్తల, అభిమానుల సమావేశం శ్రీ బెజవాడ రామచంద్రారెడ్డిగారి అధ్యక్షతన 7 తేదీ ఉదయగిరిలో జరిగింది. జిల్లాపార్టీఅధ్యక్షులు శ్రీ పెళ్లేటి వెంకటకృష్ణారెడ్డిగారు సమావేశాన్ని ప్రారంభించారు. రాష్ట్రపార్టీ కార్యదర్శి శ్రీ పనుపులేటి కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి శ్రీ దివి కొండయ్యచౌదరిగారలు వుపన్యసించారు. సమావేశం నాలుగు గంటలసేపు జరిగింది. తాలూకాలోని వివిధ గ్రామాలనుండి సుమారు నాలుగువందల మంది ప్రతినిధులు వుత్సాహంగావచ్చి సమావేశంలో పాల్గొన్నారు.

సభాధ్యక్షులు శ్రీ రామచంద్రారెడ్డిగారు సహకార సమష్టి వ్యవసాయాలవల్ల కలుగబోవు కీడులను వివరించారు. ప్రభుత్వంలోని లోపాలను పూర్తిగా వివరించుటకు తనకోటివారికి పదిహేనురోజులు పడుతుందన్నారు. అనర్థాలకు పాలకులు దారితీయడాన్ని ప్రతిఘటించుటకే స్వతంత్రపార్టీ వుద్భవించిందన్నారు. పార్టీని బలపరచవలసిందిగా ఉదయగిరితాలూకాప్రజలను కోరారు.

శ్రీ పెళ్లేటి వెంకటకృష్ణారెడ్డిగారు ప్రసంగిస్తూ, శాసనపరిషత్ ఎన్నిక అయిపోయేవరకు కూడా, ఏపార్టీనచ్చక, తాను స్వతంత్రుడుగానే వుండిపోవాలని, క్రొత్తగా ఏర్పడినస్వతంత్రపార్టీ ఆశయాదర్శాలు తన స్వతంత్రప్రవృత్తికి సరిపడినందున ఆపార్టీలో చేరానని చెప్పారు. ఇతరులను రక్షించుటకేగాక,తమను తాము రక్షించుకొనుటకుగూడా అందరూ స్వతంత్రపార్టీలో చేరాలన్నారు. అన్ని రంగాలలో ప్రభుత్వం జోక్యంకల్గించుకొని చికాకు కల్గిస్తున్నదని, ఈవిధానం దేశాన్ని ముందుకు

—కొంవ 11 వ పేజీలో


## కేసరి పైర్లకు...

ఎముకల పిండి - ఎముకల జవ

కేసరి పైర్లకు అత్యద్భుతంగా పనిజేయును

మాచే తయారుచేయబడి - ప్రభుత్వంచే రిజిష్ట్రేషను సర్టిఫికేటు పొందబడిన - అన్ని పైర్లకు ఉపకరించు

**** మిశ్రమ ఎరువులు ****

కేరళ ప్రభుత్వ ఫ్యాక్టరీలో తయారైన

సూపర్ ఫాస్ఫేటు

సరిక్రొత్త సరుకు

మైసూరు కంపెనీవారి అన్ని పైర్లకు

తెగుళ్ళ మందులు

మా వద్ద తయారుగా వున్నవి

గమనిక :- పై ఎరువులు, మందులు కొడవలూరులోని మామిల్లు వద్ద కూడా నెల్లూరు ధరలకే విక్రయించబడును.

రైతులు త్వరపడవలెను

ఆంధ్ర బోన్‌మిల్ కంపెనీ,

స్టోర్‌హవుస్ పేట (రేబాలవారి సందు) నెల్లూరు

నెల్లూరు టెలిఫోన్ : 67 * కొడవలూరు టెలిఫోన్ : 3

